



# ఈకాలం

THE HONEST TELUGU DAILY

గురువారం 29-01-2026 | పేజీలు : 4 | వెల రు : 2/- | సంపుటి : 1 సంచిక :90 | ప్రచురణ: తెలంగాణ | ఎడిటర్ : దేవేందర్ నూకల





# దేశానికే రోల్‌మోడల్‌గా డిజాస్టర్ మేనేజిమెంట్



- రూ.100 కోట్లతో అత్యాధునిక పరికరాలు
- రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ శిక్షణా కేంద్రం
- క్షేత్రస్థాయి వరకు అడ్వాన్స్‌డ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు
- రాష్ట్ర రెవెన్యూ,హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


ప్రకృతి విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొని వీలైనంతవరకూ ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల నిర్వహణా సంస్థ విభాగాన్ని బలోపేతం చేసి దేశానికి ఒక రోల్ మోడల్‌గా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

పేజి 2లో



# మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాదం

- విమాన ప్రమాదంతో డిప్యూటి సిఎం అజిత్ పవార్ దుర్మరణం
- పవార్‌తో పాటు ఇద్దరు సహాయకులు, ఇద్దరు పైలెట్లు మృతి



మహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాద ఘటన చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ అనంతరావు పవార్ బుధవారం బారామతి దగ్గర చార్టర్డ్ విమానం కూలిపోవడంతో దుర్మరణం చెందారు. ఈ ఘటనలో ఆయనతోపాటు విమానంలో ఉన్న మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. ముంబై నుంచి బారామతి వెళ్తున్న ఈ ప్రైవేట్ ఎయిర్‌క్రాఫ్ట్ ఉదయం 8:45 గంటల సమయంలో క్రాష్ అయినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అజిత్ పవార్ వయసు 66 సంవత్సరాలు. మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ ప్రయాణిస్తోన్న విమానం బారామతిలో ల్యాండ్ అయ్యే సమయంలో కుప్పకూలినట్టు తెలుస్తోంది. కూలిన వెంటనే విమానం నుంచి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.

పేజి 2లో

## అనర్హత పిటిషన్‌ను కొట్టివేయాలి: స్పీకర్‌కు దానం నాగేందర్ వినతి



2లో

## అమెజాన్‌లో 16వేల మంది ఉద్యోగులు తొలగింపు




2లో

# కల్తీ నెయ్యిపై జగన్ బుకాయింపు

- నిజనిర్ధారణ జరిగాక కూడా తప్పుదోవ పట్టించే ప్రకటనలు
- సహచర మంత్రులతో సంభాషణలో లోకేశ్ ఆగ్రహం


మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మహాపాపం చేసి కూడా బుకాయించు కోవటం జగన్ కే చెల్లిందంటూ వ్యాఖ్యలు చేశారు. కేబినేట్‌కు ముందు ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రులతో లోకేశ్ అల్పాహార విందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి అంశాన్ని ప్రస్తావించారు. పవిత్రమైన తిరుపతి లడ్డూలో కల్తీ జరిగిందని నిర్ధారణ అయ్యాక కూడా నివేదికను వక్రీకరిస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని జగన్‌పై ఫైర్ అయ్యారు.

పేజి 2లో



## రాష్ట్రంలో మరో కుంభకోణాన్ని బయటపెడుతున్నా..: హరీశ్‌రావు

హైదరాబాద్: రాష్ట్రంలో మరో అవినీతి కుంభకోణాన్ని బయటపెడుతున్నట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు. ఎక్సైజ్ శాఖలో కొత్తగా మైక్రో బేవరేజెస్‌కు అనుమతులు ఇస్తున్నారని విమర్శించారు. "110 దరఖాస్తుల్లో 25కు అనుమతి ఇవ్వాలని నిర్ణయించారు. కొత్త అనుమతుల్లో ముఖ్య నేత కోటా 21, మంత్రి కోటా 4" అని హరీశ్ రావు ఆరోపించారు.



# మేడారం జాతరలో జనసందడి

- గద్దెలకు అమ్మవార్లు చేరుకునే సమయం ఆసన్నం
- భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం



ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా, తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర మొదలయ్యింది. లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. జాతరలో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. సాయంత్రం కన్నెపల్లి నుంచి సారలమ్మ అమ్మవారు మేడారం గద్దెపైకి రానున్నారు. కన్నెపల్లిలోని సారలమ్మ మందిరంలో కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం భారీ భద్రత మధ్య సారలమ్మ గద్దెకు చేరుకుంటారు. గోవింద రాజు, పగిడిద్ద రాజులు కూడా గద్దెలకు చేరుకుంటారు. అలాగే గురువారం సాయంత్రం చిలకలగుట్ట నుంచి సమ్మక్క అమ్మవారు గద్దెపైకి వస్తారు. సమ్మక్క రాకతో జాతర పరిపూర్ణం కానుంది. మరుసటి రోజు అనగా శుక్రవారం(జనవరి 30) భక్తులు సమ్మక్క - సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

పేజి 2లో

# పిఠాపురం రైల్వే స్టేషన్‌ను మోడల్‌గా అభివృద్ది

- పిఠాపురం నుంచి కాకినాడకు నేరుగా రైలు
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరిన డిప్యూటి సిఎం పవన్

ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన పిఠాపురం రైల్వే స్టేషన్‌ను మోడల్ రైల్వే స్టేషన్‌గా అభివృద్ధి చేయాలని పవన్ విజ్ఞప్తి చేశారు. శక్తిపీఠం, పాదగయ, శ్రీపాద వల్లభస్వామి ఆలయాలు ఉన్న ఈ పట్టణానికి తగిన మౌలిక వసతులు, ఆధునిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా కేంద్ర రైల్వే, సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్విని వైష్ణవ్‌తో పవన్ సమావేశమయ్యారు. పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన అనేక కీలక అంశాలపై ఈ సమావేశంలో వినతిపత్రం సమర్పించారు. పిఠాపురం నుంచి కాకినాడకు నేరుగా రైలు కనెక్టివిటీ ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం సామర్లకోట మీదుగా వెళ్లాల్సి ఉండటంతో ప్రయాణికులు, సరుకు రవాణాకు ఎక్కువ సమయం పడుతోందని, అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని కేంద్రమంత్రికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. పీఎం గతి శక్తి పథకం కింద పిఠాపురం పరిధిలో సామర్లకోట - ఉప్పాడ రోడ్డుపై రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా చేపట్టాలని కోరిన పవన్.. ఇది ట్రాఫిక్ సమస్యలను తగ్గిస్తుందని అన్నారు. జాతీయ రైల్వే ప్రణాళిక - 2030లోని మాన్యువల్ లెవల్ క్రాసింగ్‌లను తొలగించాలనే లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుందని పవన్ వివరించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా పవన్ కళ్యాణ్ మరికొంత మంది కేంద్రమంత్రులతో భేటీ అవనున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పవన్ సమావేశమవుతారు. అలాగే కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో డిప్యూటీ సీఎం భేటీ అవనున్నారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు పెండింగ్ అంశాలను త్వరగా పరిష్కరించాలని ఈ సందర్భంగా కేంద్రమంత్రులను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కోరనున్నట్లు తెలుస్తోంది.





# సంపాదకీయం

## ఆదివాసీల అస్తిత్వ పతాక



## ‘మేడారం’

మేడారం జాతరను ఎన్నిసార్లు చూసినా, అక్కడి ఆదివాసీ సంప్రదాయాలతో ఎన్నిసార్లు సహానుభూతి చెందినా తనివి తీరదు. ప్రతీసారి ఏదో ఒక విభిన్నత అనుభవంలోకి వచ్చి భావోద్వేగాన్ని కలిగిస్తుంది. తెలంగాణ నేల స్వభావానికి, సాంస్కృతిక వైభవ పరంపరకు మేడారం నిలువెత్తు ప్రతీక. మూలవాసుల అస్తిత్వానికి పతాక చిహ్నమై, ప్రకృతితో పెనవేసుకున్న వారి ఆచార వ్యవహారాలకు సంకేతమై శరీరాన్ని రోమాంచితం చేస్తుంది. మేడారం జాతర రెండేళ్లకోసారి జరిగే పండుగ మాత్రమే కాదు, అది ఒక జీవన విధానం. ప్రకృతిలోకి ప్రయాణం చేసి పొందే తాదాత్మ్యత. అక్కడేదో మహత్తు ఉంది.

మేడారంలో కొలువైన సమ్మక్క, సారలమ్మలకు సంబంధించి జనశ్రుతుల్లో అనేక గాథలు ప్రచారంలో ఉన్నాయి. వాళ్లు కోయ పాలకులని, కాకతీయులకు సామంతులని, కప్పం కట్టలేక ప్రజల కోసం వారిని ఎదిరించి యుద్ధంలో ప్రాణాలను త్యజించిన వీరులనీ కథనాలు ప్రచారంలో ఉన్నాయి. మరోవైపు వాళ్లు పుట్టు దేవతలని, చల్లని తల్లులని, కోరిన కోర్కెలు తీర్చే దైవాలని ఆదివాసీలు కథలు కథలుగా చెప్పుకుంటారు, తమ ఇలువేల్పులుగా కొలుస్తారు. ఇప్పటికే ప్రాచుర్యంలో ఉన్న కథనాలకు తోడుగా, కాలక్రమంలో అనేక కొత్త కథనాలూ వ్యాఖ్యానాలూ పుట్టుకువస్తున్నాయి.

ఎన్ని ప్రచారాలు, కథనాలు ఉన్నా సమ్మక్క సారలమ్మలు... భక్తకోటి గుండెల్లో దైవాలుగా వెలుగొందుతున్నారు. కోరిన కోర్కెల్ని తీర్చే మహిమాన్విత శక్తులుగా, వీరత్వానికి ప్రతీకలుగా విరాజిల్లుతున్నారు. పోరాటాలకు, ఉద్యమాలకు స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తున్నారు. మేడారం మొన్నటివరకు కనీసం గ్రామ పంచాయతీ కూడా కాదు. ఊరట్టం అనే పంచాయతీలో ఆవాస గ్రామం. పట్టుమని వెయ్యి మంది జనాభా కూడా లేని ఓ మారుమూల పల్లె. కానీ అక్కడ కొలువైన వనదేవతల మూలంగా ఆ పల్లె రెండేళ్లకోసారి కోటి మందిని తన దగ్గరకు రప్పించుకుంటుంది.

మారుమూలన ఉన్న ఓ వనారణ్యం.. రెండేళ్లకోసారి జనారణ్యమై భాసిల్లడానికి జాతరలోని విభిన్నతే కారణం. స్వచ్ఛమైన ప్రకృతి ఒడిలో ఈ జాతర నాలుగు రోజుల పాటు సాగుతుంది. ఆదివాసీల అరుదైన పూజా విధానాలతో, తీరొక్క మొక్కులతో అబ్బురపరుస్తుంది. గుడి ఉండదు.. గోపురాలు ఉండవు, ధ్వజస్తంభం ఉండదు.. ద్వారపాలకులు ఉండరు, అర్చకులు ఉండరు.. ఆర్జిత సేవలూ ఉండవు. నాలుగు వృత్తాకార గద్దెలపై, నడుమ పాతిన కర్రలే దైవాలకు ప్రతిరూపంగా కనిపిస్తాయి. జాతర వేళ కుంకుమ భరిణెలను ప్రతిష్ఠించినా అవి బయటకు కనిపించవు. మేడారంలో సమ్మక్క, సారలమ్మలు భౌతిక రూపాల్లో దర్శనమివ్వరు. వారు పూర్తి అమూర్తంగా ఉంటారు. జంపన్నవాగులో పుణ్యస్నానం చేసి, గద్దెల వద్దకు వచ్చి ‘సల్లంగ సూడు సమ్మక్క తల్లీ..’ అని రెండు చేతులెత్తి ప్రార్థించడంతో మొక్కు పూర్తవుతుంది. అక్కడ నిర్వచించలేని ఓ నమ్మకం, విశ్వాసం నిటారుగా నిలబడిన దాఖలా కనిపిస్తుంది. అదొక రహస్య జగత్తు.

జాతర ఆద్యంతం అలుముకునే ఉద్విగ్నత ప్రతీ ఒక్కరిని సమ్మోహనుల్ని చేస్తుంది. నిండు పౌర్ణమి వేళ సమ్మక్క, సారలమ్మ రాక, గద్దెలపై కొలువుదీరే ఘట్టాలు మేడారం అటవీప్రాంతాన్ని భక్తిపారవశ్యపు శిఖరాగ్రాన నిలబెడతాయి. తొలిరోజు కన్నెపల్లి నుంచి సారలమ్మను, రెండోరోజు చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను గద్దెలపైకి తీసుకువచ్చే ఘట్టాలను ప్రత్యక్షంగా చూడటం జీవితకాల జ్ఞాపకం. ఈ రెండు ఘట్టాలు సాయంత్రం 5 గంటలకు మొదలై రాత్రి 8 గంటల కల్లా పూర్తవుతాయి. ఆ వ్యవధిలో మేడారం భక్తజన సంద్రమై ఉప్పొంగుతుంది. లక్షలాది కోళ్లూ, యాటలూ తలలు తెంచుకొని తల్లులకు రక్తాభిషేకం చేస్తాయి. శివసత్తులు శిగాలూగుతూ అపర వనదేవతలై వీరంగమాడుతారు. తల్లులను తరలించే ఆదివాసీ వడ్డెలను (పూజారులు) తాకడం కోసం దారిపొడవునా జనం పోటెత్తుతారు. తల్లులు గద్దెలపైకి చేరడంతోనే మేడారం... నిండు పున్నమి వెలుగులో దైవక్షేత్రంగా రూపుదాల్చి జేగీయమానమవుతుంది. మొక్కులు ఊపందుకుంటాయి. తల్లుల చెంతకు భక్తులు వెల్లువెత్తుతారు. ఆ సమయంలో గద్దెల ప్రాంగణమే కాదు, మేడారం యావత్తూ అద్భుతమైన కాంతితో ప్రకాశిస్తూ సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తుంది.

ఆదివాసీల పూజావిధానాలు సామాన్యుల జీవన రీతులకు దగ్గరగా, వారి ఆర్థికస్థాయికి తగినట్టుగా ఉంటాయి. అందుకే సమ్మక్క, సారలమ్మలు ఆదివాసులకే కాదు, ఆదివాసీయేతరులకూ ఇష్టదైవాలుగా వెలుగొందుతున్నారు. ఎంతో చవక అయిన బెల్లంను బంగారంగా అప్పగించడం, ఒడి బియ్యం పోయడం, చీరసారెలు సమర్పించడం, ఎదురుకోళ్లను ఎగరేయడం, కోళ్లు, యాటలను బలి ఇవ్వడం.. ఇలా అనేకరకాలుగా మొక్కులు చెల్లించుకుంటారు. ఇతర తీర్థయాత్రలతో పోల్చుకుంటే మేడారం యాత్ర ఖర్చు తక్కువ. అందుకే ఇది సామాన్యుల జాతరగా విలసిల్లుతోంది.

ఆదివాసులకు పండుగలు, జాతరలు అంటే ఒక వినోదం. తమ రోజువారీ జీవితాల నుంచి ఉపశమనం పొందే ఘట్టం. అందుకే మేడారం జాతర విందూవినోదాల సమాగమంగా సాగుతుంది. మందు, మాంసం లేనిదే పూట గడవదు. ఆటపాటలు లేనిదే జాతర ప్రయాణం పరిపూర్ణం కాదు. దేవతల దర్శనానికి ముందూ తర్వాతా జాతరలో భక్తులకు ఎలాంటి కట్టుబాట్లు ఉండవు. నెలసరిలో ఉన్న మహిళలు, అయిన వాళ్లను కోల్పోయి సుష్టులో ఉన్నవారు సైతం దర్శనం చేసుకుంటారు. ముహూర్తాలు, ఘడియలు, వర్జ్యాలు, అమావాస్యలు, వారాలు ఇక్కడ లెక్కలోకి రావు. దేవతలకు, భక్తులకు మధ్య సంధానకర్తలు ఉండరు. ఈ పద్ధతులే సమస్త జనాన్ని సమ్మక్క, సారలమ్మలకు పరమ భక్తులను చేశాయి. ఏపీ, తెలంగాణ నుంచే కాదు, మధ్యప్రదేశ్?, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా భక్తులు మేడారం బాట పడతారు.

కాలం ఎంత మారుతున్నా, ఆధునికత ఎంత చుట్టుముడుతున్నా మేడారం తన అస్తిత్వ మూలాలను చేజార్చుకోలేదు. బ్రాహ్మణీయ విధానాలను చొప్పించే ప్రయత్నాలు జరిగినప్పుడల్లా ఆదివాసీలు వడిసెల రాళ్లలా ఎదురుదాడికి దిగిన సంఘటనలు ఎన్నో. అభివృద్ధికి, విస్తరణకు సహకరిస్తూనే వారు మేడారం జాతర అస్తిత్వాన్ని కాపాడుకుంటున్నారు. ఒకప్పుడు మేడారం రావాలంటే ఎగుడుదిగుడు మట్టిదారుల్లో ఎడ్లబండ్లే శరణ్యం. గత 30 ఏళ్లుగా ఇక్కడ ఎంతో అభివృద్ధి కనిపిస్తోంది. పాలకులు వందల కోట్లు ఖర్చు చేస్తున్నారు. రోడ్డు రవాణా సౌకర్యాలు ఎంతో మెరుగుపడ్డాయి.

ఈసారి జాతరకు మేడారం కొత్త రూపును సంతరించుకోవడం విశేషం. రూ.101 కోట్ల వ్యయంతో గద్దెలు, గద్దెల ప్రాంగణం చుట్టూ పాలరాతి మహా ద్వారాలను, వృత్తాకార నిర్మాణాలను పాలకులు ఏర్పాటు చేశారు. ద్వారాలపై ఆదివాసీల గొట్టు, గోత్రాలు, వారి ఆచార వ్యవహారాలకు సంబంధించిన చిత్రాలను శిల్పాలుగా చెక్కించారు. మొన్నటివరకు వనదేవతల గద్దెలు ప్రకృతి ఒడిలో సహజసిద్ధంగా కనిపించేవి. ఇప్పుడు పాలరాతి మహాద్వారాలు, వలయాకార నిర్మాణాల మూలంగా అవి మునుపటి ప్రభను కోల్పోయాయనే అభిప్రాయం ఉన్నా, దేవతలపై భక్తులకున్న అపార విశ్వాసం, నమ్మకం ముందు అవేవీ అడ్డంకిగా కనిపించడం లేదు. మేడారం చరిత్రను శాశ్వతం చేసి, జాతర గొప్పతనాన్ని ప్రపంచానికి చాటడం, వనదేవతల దర్శనాన్ని మరింత సులభం చేయడం కోసమే గద్దెల విస్తరణ, అభివృద్ధిని చేపట్టినట్టు ప్రభుత్వం చెబుతున్న వాదనకు మద్దతు బాగానే ఉంది. మేడారంలో చేపట్టిన అభివృద్ధి పనులకు గుర్తుగా తొలిసారిగా వనదేవతల చెంతన క్యాబినెట్? సమావేశం నిర్వహించి ప్రస్తుత ప్రభుత్వం చరిత్ర సృష్టించింది.

# దేశానికే రోల్‌మోడల్‌గా డిజాస్టర్ మేనేజిమెంట్

ఎటువంటి విపత్తులనైనా ఎదుర్కొనేలా వంద కోట్ల రూపాయిలతో అత్యాధునిక పరికరాలను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి బుధవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో విపత్తుల నిర్వహణా విభాగం, ÷ర్ సర్వీసెస్, ఎస్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా, ఐ సిసిసి విభాగాలతో సమావేశం నిర్వహించి ఎలాంటి పరికరాలను కొనుగోలు చేయాలన్న విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. వరదలు, అగ్నిప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితుల్లో త్వరితగతిన స్పందించడానికి ఖచ్చితమైన సమాచార వ్యవస్థ, రియల్‌టైమ్ మానిటరింగ్ సాధ్యమయ్యేలా విపత్తు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, డ్రోన్లు, శాటిలైట్ ఆధారిత కమ్యూనికేషన్, ఆధునిక రెస్క్యూ పరికరాలు, అత్యాధునిక ÷ర్ / సెర్చ్ ఆపరేషన్ల సాంకేతికతను రెవెన్యూ?విపత్తు నిర్వహణ విభాగాలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు.విపత్తు విభాగంలో పనిచేసేవారికి శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ మేనేజిమెంట్ ఆధ్వర్యంలో అత్యుత్తమ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే వాతావరణ పరిస్థితులు క్షేత్రస్థాయి వరకు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసేలా ఆయా స్థానిక పరిస్థితులను బట్టి మండల స్థాయి వరకు అడ్వాన్సుడ్ వెదర్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని



నిర్ణయించినట్లు తెలిపారు. భారీ వర్షాలు వరదల సమయంలో వాగుల్లో వంకల్లో చెరువుల్లో చిక్కుకున్నవారిని రక్షించడానికి ఎయిర్‌లిఫ్ట్ మెకానిజం తయారు చేసుకోవాలని ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని తరలించడానికి 70 నుంచి 80 కిలోల బరువును ఎత్తే డ్రోన్లను కొనుగోలు చేయాలని సూచించారు. ఎయిర్ లిఫ్ట్ వ్యవస్థ సరిగాలేకపోవడం వల్ల 2024 సంవత్సరంలో నా పాలేరు నియోజవకర్గంలో వాగుల్లో చిక్కుకున్న బాధితులను రక్షించుకోలేక పోయానని ఈ సందర్భంగా మంత్రిగారు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రాష్ట్రంలో ఏ మారుమూల ప్రాంతంలోనైనా మాట్లాడడానికి వీలుగా సిమ్ ఆధారిత విహెచ్ ఎఫ్ రేడియో సిస్టమ్స్ అందుబాటులోకి తేవాలని సూచించారు. ఇప్పటికే ఈ వ్యవస్థ అందుబాటు లో ఉంది. వ్యవస్‌టను క్షేత్రస్థాయి వరకు తీసుకువెళ్లాలని సూచించారు. అలాగే హైదరాబాద్ నగరంలో హైరైజ్డ్ భవనాలలో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని సమర్ధవంతంగా ఎదుర్కొనేలా అవసరమైన పరికరాలను కొనుగోలు చేయాలని హైడ్రా కమిషనర్‌కు సూచించారు. 77 హైస్పీడ్ బోట్‌లను కొనుగోలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో 12 ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు ఉన్నాయని, ఒక్కో బృందంలో వెయ్యిమంది వరకు ఉన్నారని వీరందరికీ ఎప్పటికప్పుడు శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అరవింద్ కుమార్, అగ్నిమాపకశాఖ డైరెక్టర్ విక్రమాన్ సింగ్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఐసిసిసి డైరెక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనర్హత పిటిషన్‌ను కొట్టివేయాలి: స్పీకర్‌కు దానం నాగేందర్ వినతి

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అఫిడవిట్ దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్న పిటిషన్‌ను కొట్టి వేయాలని స్పీకర్‌కు విన్నవించారు. “నేను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదు. పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు నాకు సమాచారం లేదు. నేను 2024 మార్చిలో కాంగ్రెస్ సమావేశానికి వెళ్లాను. ఆ సమావేశానికి వ్యక్తిగత హోదాలో వెళ్లాను. మీడియా కథనాల ఆధారంగా నేను పార్టీ మారినట్లు బీఆర్ఎస్ భావిస్తోంది. ఆ పార్టీ అనర్హత పిటిషన్‌లోని అంశాలపై మాత్రమే వివరణ ఇస్తున్నాను. గతంలో కోర్టు తీర్పులను అనుసరించి ఆ అనర్హత పిటిషన్ చెల్లుబాటు కాదు. అనర్హత పిటిషన్ తర్వాత పరిణామాలను అనుబంధ సమాచారంగా అంగీకరించవద్దు” అని దానం నాగేందర్ కోరారు. ఈ నెల 30న విచారణకు రావాలని దానం నాగేందర్‌కు స్పీకర్ ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే.

## అమెజాన్‌లో 16వేల మంది ఉద్యోగులు తొలగింపు

మొదటి పేజీ తరువాయి

ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ (ూఎఝఓశీఅ) మరోసారి భారీ సంఖ్యలో లేఆఫ్ ప్రకటించింది. గతేడాది అక్టోబర్‌లో 14 వేల మంది కార్పొరేట్ ఉద్యోగులను తొలగించగా.. తాజాగా 16వేల మంది ఉద్యోగులకు ఉద్వాసన పలుకుతున్నట్లు పేర్కొంది. ఈ విషయాన్ని సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గలెటీ అధికారికంగా వెల్లడించారు. 2023 తర్వాత ఈ స్థాయిలో ఉద్యోగులను తొలగించడం ఇదే తొలిసారి. అప్పుడు దాదాపు 27వేల మందికి అమెజాన్ లేఆఫ్‌లు ప్రకటించిన విషయం తెలిసిందే.తొలగింపు ప్రక్రియలో భాగంగా.. కార్పొరేట్ ఉద్యోగుల స్థానంలో జనరేటివ్ ఏఐను వినియోగించే యోచనలో ఉన్నట్లు అమెజాన్ పేర్కొంది. కరోనా సమయంలో తీసుకున్న ఉద్యోగుల సంఖ్యలో భారీగా కోత విధిస్తున్నట్లు తెలిపింది. పలు విభాగాలను తగ్గించి, భాగస్వామ్యం పెంచడం, పాలనా వ్యవస్థలను తొలగించే ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించింది. అయితే, ఏయే విభాగాల్లో ఈ తొలగింపులు ఉంటాయనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.అక్టోబర్‌లో చేపట్టిన సంస్థాగత మార్పులు పూర్తయ్యాయని వెల్లడించిన గలెటీ.. అంతర్గతంగా కొత్త రోల్ వెతుక్కునేందుకు అమెరికా ఉద్యోగులకు 90 రోజుల గడువు ఇస్తున్నామని చెప్పారు. ఆలోగా కొత్త రోల్‌ను ఎంచుకోని వారికి నిబంధనల ప్రకారం ఇతర ప్రయోజనాలు అందిస్తామన్నారు. ఈ మార్పులు చేస్తూనే వ్యూహాత్మక విభాగాల్లో నియామకాలు కొనసాగిస్తామన్నారు.

## మేడారం జాతరలో జనసందడి

మొదటి పేజీ తరువాయి

చివరి రోజైన శనివారంసాయంత్రం సమ్మక్క, సారలమ్మ, గోవింద రాజు, పగిడిద్ద రాజులు వన ప్రవేశం చేస్తారు. దీంతో జాతర పరిపూర్ణంగా ముగుస్తుంది. మేడారం మహా జాతర తెలంగాణ సంస్కృతి, గిరిజన సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. మేడారంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేసి, వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్నారు భక్తులు. జనాల గుడారాలతో మేడారం కిటకిటలాడుతోంది. భక్తులు బెల్లం(బంగారం) సమర్పిస్తూ ఆచారాలు పాటిస్తున్నారు. మహాజాతరకు ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. దాదాపు మూడు కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా. ప్రభుత్వం తాజాగా గద్దెలను పునర్నిర్మాణం చేసింది. అలాగే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రవాణా, నీరు, వైద్యం, భద్రతా ఏర్పాట్లు చేశారు.మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర ప్రారంభం కావడంతో ములుగు జిల్లాలోని అడవులన్నీ భక్తజనసంద్రంగా మారాయి. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండగగా పేరొందిన ఈ జాతరలో అత్యంత కీలకమైన ఘట్టం జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించడం. సారలమ్మ గద్దెపైకి వస్తున్న తరుణంలో వేలాది మంది భక్తులు జంపన్న వాగు వద్దకు పోటెత్తడంతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడుతోంది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా భక్తులందరూ బస్సుల ద్వారా, సొంత వాహనాల ద్వారా నేరుగా వాగు వద్దకు చేరుకుని తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. మేడారం వచ్చే ప్రతి భక్తుడు ముందుగా జంపన్న వాగును సందర్శించడం ఒక ఆచారంగా వస్తోంది. ఇక్కడ పుణ్యస్నానం ఆచరించిన తర్వాతే అమ్మవార్ల గద్దెల దర్శనానికి వెళ్లడం సంప్రదాయం. భక్తులు తమ వెంట తెచ్చుకున్న అమ్మవారి ప్రతిమలను వాగులో పవిత్రంగా కడిగి, పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు తమ ఇళ్ల వద్ద ప్రతిష్ఠించుకున్న గద్దెలను మేడారం తీసుకువచ్చి, ఇక్కడ జంపన్నకు మొక్కులు అప్పగిస్తారు. తాము కోరుకున్న కోరికలు నెరవేరినందుకు కృతజ్ఞతగా 'ఎత్తు బంగారం' అంటే తమ బరువుకు సమానమైన బెల్లాన్ని అమ్మవార్లకు సమర్పించేందుకు సిద్ధమవుతారు. ముఖ్యంగా అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన వెదురు లంకలను (ఎదురు కర్రలు) పట్టుకుని భక్తిపాటలు పాడుతూ భక్తులు చేసే సందడి జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

## కల్తీ నెయ్యిపై జగన్ బుకాయింపు

మొదటి పేజీ తరువాయి

పాలే లేని కల్తీ నెయ్యిని సృష్టించి దేవుడి ప్రసాదాన్ని అపవిత్రం చేయటం క్షమించరాని నేరమన్నారు. వందలకోట్ల కుంభకోణానికి పాల్పడటమే కాకుండా అసత్యాలతో ప్రజల్ని తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. వైసీపీ కుట్రలను ధీటుగా తిప్పికొట్టడంతో పాటు వారి భాగోతాన్ని ప్రజల్లోనే ఎండగడదామని మంత్రులతో జరిగిన సమావేశంలో నారా లోకేశ్ సూచించారు.÷ూగా.. తిరుమల శ్రీవారి ప్రసాదమైన లడ్డూ తయారీలో ఉపయోగించిన కల్తీ నెయ్యి కేసులో సీబీఐ ఆధ్వర్యంలోని సిట్ ఇటీవల తుది ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ చార్జ్‌షీట్‌లో 36 మందిని నిందితులుగా చేర్చింది. వీరిలో 12 మంది టీటీడీ ఉద్యోగులు కూడా ఉన్నారు. 2019 నుంచి 2024 వరకు రూ.235 కోట్ల విలువైన 60 లక్షల కిలోల కల్తీ నెయ్యిని తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి ఉపయోగించారని సిట్ దర్యాప్తులో తేలిన సంగతి తెలిసిందే.

## మాహారాష్ట్ర రాజకీయాల్లో తీరని విషాదం

మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనలో విమానం రెండు ముక్కలైంది. అందులోని వారంత కాలి బూడిదయ్యారు. అజిత్ పవార్.. బారామతిలో బహిరంగ సభకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు సమాచారం. ఘటనాస్థలిలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కూలిపోయి అగ్నికి ఆహుతైన విమానంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తోపాటు, మరో ఇద్దరు సిబ్బంది ఒక పీఎస్ఓ, ఒక సహాయకుడు మరో ఇద్దరు పైలట్, కో-పైలట్ మొత్తం ఐదుగురు ఉన్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, విమానంలో ఉన్న ఏ ఒక్కరూ ఈ ప్రమాదం నుండి ప్రాణాలతో బయటపడలేదని డీజీసీఏ అధికారికంగా ప్రకటించింది. అజిత్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అజిత్ పవార్ వర్గం అధ్యక్షులు. మహారాష్ట్రలో అత్యధిక కాలం ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన నాయకుడు. 2024 డిసెంబరు 5 నుంచి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రిగా ఉన్న మహాయుతి ప్రభుత్వంలో ఏక్‌నాథ్ షిండేతో కలిసి డిప్యూటీ సీఎంగా పనిచేస్తున్నారు. ప్రమాదం వార్త తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి రక్షణ సిబ్బంది, పోలీసులు, ఫైర్ సర్వీస్ బృందాలు చేరుకున్నాయి. డిప్యూటీ సీఎం విమాన ప్రమాదంలో చనిపోయారన్న వార్త తెలిసి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, మరో ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఇతర నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు ఈ దుర్ఘటనపై తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాయి. ప్రజలు పెద్ద ఎత్తున ఘటనాస్థలానికి చేరుకున్నారు. బారామతి నియోజకవర్గం నుంచి బలమైన బేస్ ఉన్న అజిత్ పవార్.. శరద్ పవార్ అన్నయ్య కుమారుడు. రాజకీయంగా చాలా శక్తిమంతమైన వ్యక్తిగా ఎదిగారు. ఆయన మరణంతో మహారాష్ట్ర రాజకీయాల్లో భారీ లోటు ఏర్పడిందని పలువురు రాజకీయ ప్రముఖులు చెబుతున్నారు. పవార్ మృతితో మహాయుతి కూటమి, బారామతి ప్రాంతీయ రాజకీయాలపై తీవ్ర ప్రభావం పడనుంది.

## మేడారం భక్తులకు ఇబ్బంది రావద్దు

### అధికారులతో మాట్లాడిన మంత్రి పొంగులేటి

:మేడారం మహాజాతరకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.



కోటి భక్తుల కొంగు బంగారం, తెలంగాణ కుంభమేళా సమ్మక్క సారలమ్మ మేడారం జాతరలో అత్యంత పవిత్రమైన మొదటి ఘట్టం బుధవారం ప్రారంభమైన నేపథ్యంలో సచివాలయం నుండి హై ఫ్రీక్వెన్సీ వాకీటాకీతో మేడారంలో ట్రాఫిక్ విధులను పర్యవేక్షిస్తున్న సిబ్బందితో మంత్రి మాట్లాడారు. తొలిరోజు కావడంతో భక్తుల సంఖ్య , సారలమ్మ వార్ల రాక ఏర్పాట్లు, సౌకర్యాల కల్పన, జాతరలో నెలకొన్న పరిస్థితులు గురించి మంత్రిగారు ఆరాతీశారు. ప్రజాప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా పోలీసు వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తూ, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని, భక్తుల సౌకర్యార్థం తాగునీరు, రవాణా సౌకర్యాలు ఎప్పటికప్పుడు

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి..
# రైతు ఆవేదన..



కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట శివారు బోడిగుట్ట వద్ద బుధవారం విద్యుత్ ఘాతంతో ఓ ఎద్దు మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో సుమారు ?92 వేల విలువైన ఎద్దు మరణించిందని యజమాని భుక్యా పంతులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆయన వేడుకున్నారు. దీనిపై సర్పంచ్ సంతోష్ నాయక్ స్పందిస్తూ. విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధిత రైతుకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## కామారెడ్డి చేరుకున్న మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు..



కామారెడ్డి మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు డి.ప్రశాంత్ కుమార్ బుధవారం కామారెడ్డి చేరుకున్నారు, ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్, ఇండస్ట్రీ కలెక్టరేట్ కు చేరుకున్న సందర్భంగా అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్ ఎన్నికల పరిశీలకుల రాక సందర్భంగా సందర్భంగా పూల మొక్కను అందించి స్వాగతం పలికారు.

## రామప్రభు సేవా కార్యక్రమాలను ప్రశంసించిన పి ఎ సి చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ..



మియాపూర్ 240 డివిజన్ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం స్థానిక నాయకుడు అట్టేపల్లి రామప్రభు తన సొంత ఖర్చుతో ఫాగింగ్ వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఈ దోమల ఫాగింగ్ వాహనాన్ని ఎమ్మెల్యే, పి ఎ సి చైర్మన్ అరికెపూడి గాంధీ చేతుల మీదుగా ప్రారంభించారు. రామప్రభు మియాపూర్ డివిజన్ లో చేస్తున్న సేవా కార్యక్రమాలను, అట్టేపల్లి లక్ష్మీ నారాయణ చారిటబుల్ ట్రస్ట్ టీం సభ్యుల యొక్క కృషిని అభినందించారు. వర్షాకాలం, చలికాలంలో వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నుండి ప్రజలను కాపాడటమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యం. ప్రజా ఆరోగ్య భద్రత వారి ఆరోగ్యానికి తాము ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అట్టేపల్లి పురుషోత్తం,రాజశేఖర్, గిరి, శివయ్య,దయాకర్, హరినాథ్, శ్రీనివాస్, సోమేశ్వర్, కాంతయ్య, శ్రావణ్, ప్రశాంత్, అజయ్, కిరణ్, ప్రవీణ్, రజనీకాంత్, వెంకట్ రెడ్డి, బన్నీ, చరణ్, రాజు, సాయి, రఘు, చంద్రహాస్ తదితరులు పాల్గొన్నారు .

## నూతన మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరాలి ఎమ్మెల్యే జారే





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మున్సిపాలిటీ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రజలతో నేరుగా మమేకమవుతున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజాహిత పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు అశ్వారావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన గత రెండు సంవత్సరాల కాలంలో జరిగిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో నిలిచే అభ్యర్థులకు అండగా నిలవాలని ఓటర్లను అభ్యర్థిస్తు ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఏర్పడిన విశ్వాసం కారణంగా విపక్ష పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ విధానాలకు ఆకర్షితులై స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న సందర్భంలో పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానిస్తూ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపు సాధించేందుకు అవలంబించాల్సిన విధి విధానాలపై విస్తృతంగా చర్చించారు. గత అనుభవాలను విశ్లేషిస్తూ లోటుపాట్లను సరిదిద్దుకునే దిశగా కార్యాచరణ రూపొందించి ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

# ఆదరాబాదరాగా మున్సి"పోల్స్"అభ్యర్థులను ఉరుకులు పరుగులు పెట్టిస్తున్న ఎన్నికల కమీషన్

**- జాతర వేళ - ఎన్నికలు ఎలా...???**

**- జెబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**



కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేషన్ మున్సిపాలిటీ ఎన్నికల విషయంలో ఎన్నికల సంఘం నిర్వహించిన తీరు సరైనదిగా లేదని జైభీమ్ రావ్ భారత్ పార్టీ(జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ కుంభమేళాగా చెప్పుకునే సమ్మక్క సారలమ్మ జాతరలో తెలంగాణ ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొంటుండగా కార్పొరేషన్,మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి కనీసం సమయం ఇవ్వకుండానే ఉరుకులు పరుగులు పెట్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణ విషయంలో రాష్ట్ర ఎన్నికల కమీషన్ దుందుడుకు స్వభావంతో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఒక వైపు పండగ ఉత్సవాలు,మరోవైపు ఎన్నికలతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారని,ముఖ్యంగా కొత్తగూడెం మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మార్చే ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో,డివిజన్ల విభజనపై సరైన స్పష్టత లేకపోవడం వల్ల పోటీ చేసే అభ్యర్థులలో,ఓటర్లలో గందరగోళం నెలకొందని అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లంతా కార్పొరేషన్ అవుతుందా? లేక మున్సిపాలిటీగానే కొనసాగుతుందా? అనే సందిగ్ధంలో ఉండగానే నోటిఫికేషన్ రావడం విమర్శలకు తావిస్తోందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలనుకున్నప్పుడు ప్రజలు ఆలోచించుకునే విధంగా అభ్యర్థులు పోటీ చేసే విధంగా కొంత సమయం ఇవ్వాలని అన్నారు. ఈ విషయంలో ఎన్నికల కమీషన్ ఒక్కసారి పునరాలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు,అభ్యర్థులకు తగిన సమయం ఇవ్వకుండా తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతతో పాటు,స్థానిక పరిస్థితులను పరిగణలోకి తీసుకొని సమయోచిత నిర్ణయాలు తీసుకోవాలని ఎన్నికల కమీషనర్ ను కోరారు.

# బాధితుల ఇంటి వద్దే దరఖాస్తు స్వీకరణ..

**- దోమకొండ ఎస్సై ప్రభాకర్**





ఎఫ్ఐఆర్ నమోదు చేసిన కామారెడ్డి పోలీసులు విక్టిమ్/సిటిజన్ సెంట్రిక్ పోలీసింగ్' విధానాన్ని సమర్థవంతంగా అమలు మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు సేవలే ఈ 'విక్టిమ్/సిటిజన్ సెంట్రిక్' విధానం.
-జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్.తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ప్రజలకు మరింత సులభమైన, వేగవంతమైన, బాధిత కేంద్రిత సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రవేశపెట్టిన 'విక్టిమ్/సిటిజన్ సెంట్రిక్ పోలీసింగ్ విధానం'ను కామారెడ్డి జిల్లా పోలీసులు సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. ఈ విధానం కింద ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్న బాధితుల వద్దకే వెళ్లి ఇంటి వద్దే దరఖాస్తు స్వీకరణ, ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరుగుతోంది.
ఈ విధానములో బాగముగానే ఈ రోజు జిల్లాలో చోటు చేసుకున్న పలు ఘటనల్లో పోలీసులు సకాలంలో స్పందించి బాధితుల వద్దే ఫిర్యాదు స్వీకరించి 3 కేసులు కేసులు నమోదు చేయడం జరిగింది.

**కేసుల వివరాలు :**

1) గాంధారిపోలీస్ స్టేషన్ పరిధిలో– మేకల దొంగతనం కేసు
గాంధారి మండలం హేమ్లా నాయక్ తండకు చెందిన కాంసోత్ మోహన్ తన 14 మేకలను రాత్రి ఇంటి పక్కనున్న కొట్టంలో ఉంచగా, ఉదయం లేచి చూసేసరికి ఆరు మేకలు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు మేకలను దొంగిలించారని గ్రామ సర్పంచ్ రాట్ల సురేష్ ద్వారా పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న వెంటనే గాంధారి ఎస్సై ఆంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకుని, బాధితుడి వద్దే ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీని అందజేశారు. పోలీసులు సకాలంలో స్పందించి ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై బాధితుడు హర్షం వ్యక్తం చేశారు.

2) దోమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో– చైన్ స్నాచింగ్ కేసు
దోమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న బీసు రుకుం బాయి (62) మరియు ఆమె భర్త కిష్టయ్యల ఇంట్లో రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో ముగ్గురు గుర్తుతెలియని దొంగలు చొరబడి, కత్తులతో బెదిరించి రుకుం బాయి చెవుల్లోని బంగారు కమ్మలను దోచుకున్నారు. ఈ సమయంలో పక్కింటి వెంకటమ్మ కేకలు వేయడంతో గ్రామస్తులు అప్రమత్తమై వెంబడించగా, గోనే రంజిత్ (తండ్రి: గంగరాజు), అన్నారం గ్రామం, రామారెడ్డి మండలానికి చెందిన ఒక దొంగను పట్టుకోగా, మిగతా ఇద్దరు పరారయ్యారు. సమాచారం అందుకున్న దోమకొండ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల ఇంటి వద్దే ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ ప్రతులను అందజేశారు.

3) లింగంపేటపోలీస్ స్టేషన్ పరిధిలో – రోడ్డు ప్రమాద మృతి కేసు
ఎక్కపల్లి–సజ్జనపల్లి మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దక్కన్న మల్లేష్ మృతి చెందగా, సమాచారం అందుకున్న లింగంపేట ఎస్సై పి. దీపక్ కుమార్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. భర్త మృతి చెందడంతో తీవ్ర దుఃఖంలో ఉన్న భార్య స్వప్న వద్దకు వెళ్ళి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ కాపీని అందజేశారు. జిల్లా ఎస్పీ అభినందన
ఈ సందర్భంగా గాంధారి ఎస్సై ఆంజనేయులు, దోమకొండ ఎస్సై ప్రభాకర్, లింగంపేట ఎస్సై దీపక్ కుమార్ సిబ్బందిని కామారెడ్డి జిల్లా ఎస్పీ యం.రాజేష్ చంద్ర, ఐపీఎస్ అభినందించారు. ఈ విధానం కింద మహిళలు, చిన్నారులు, వృద్ధులు తదితర బాధితులు పోలీస్ స్టేషన్?కు వెళ్లకుండానే వారి ఇంటి వద్దే దరఖాస్తు ఇచ్చే అవకాశం తద్వారా ఎఫ్?ఐఆర్ నమోదు చేయబడుతుందని ఎస్పీ తెలిపారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాలు, శారీరక దాడులు, ఆస్తి వివాదాలు, పోక్సో చట్టం, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాల్య వివాహాల నిషేధ చట్టం, దొంగతనం, చైన్ స్నాచింగ్, రాబరీ, డెకాయిటీ, ర్యాగింగ్ నిరోధక చట్టం కింద నమోదయ్యే కేసుల్లో ఈ సేవలు అమలులో ఉంటాయని తెలిపారు. బాధితుల గౌరవం, హక్కులను కాపాడుతూ వృత్తి పరమైన సేవలు అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని యస్పి పేర్కొన్నారు.

# నామినేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి..

**- సాధారణ పరిశీలకులు డి.ప్రశాంత్ రెడ్డి**





కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికలకుసంబంధించి నామినేషన్ ప్రక్రియ ఏర్పాట్లను సాధారణ పరిశీలకులు డి. ప్రశాంత్ రెడ్డి బుధవారం పరిశీలించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నామినేషన్ల ప్రక్రియను ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నామినేషన్లు స్వీకరించే సమయంలో అభ్యర్థులు ఏయే ధ్రువీకరణ పత్రాలు జత చేయాలో స్పష్టంగా తెలియజేయాలని, ఏవైనా సందేహాలు తలెత్తినట్లయితే వెంటనే పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాల వివరాలను పరిశీలించారు. మొదటి నామినేషన్ కేంద్రం రెవెన్యూ సెక్షన్?లో ఏర్పాటు చేయగా, అక్కడ 1 నుండి 15 వార్డుల నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రెండవ నామినేషన్ కేంద్రం కౌన్సిల్ మీటింగ్ హాల్?లో ఏర్పాటు చేయగా, అక్కడ 16 నుండి 45 వార్డుల నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మూడవ నామినేషన్ కేంద్రాన్ని అకౌంట్స్ సెక్షన్?లో ఏర్పాటు చేసి, అక్కడ 46 నుండి 49 వార్డుల నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అలాగే అన్ని నామినేషన్ కేంద్రాలలో సీసీ కెమెరాలు, డిజిటల్ వాచ్?లు ఏర్పాటు చేయడంతో పాటు పోలీస్ బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటు చేసినట్లు పరిశీలకులు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికలలో అభ్యర్థులు చెల్లించవలసిన డిపాజిట్ మున్సిపల్ వార్డు సభ్యుడు ఎస్సీ.ఎస్టీ.బీసీ. అభ్యర్థులు 1,250, ఇతరులు 2,500 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీఓ వీణ, తహసిల్దార్ జనార్ధన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెలగని హేమాక్స్ లైట్లులు..




కామారెడ్డి జిల్లా డోంగ్లి మండలం లింబూర్ గ్రామంలో హేమాక్స్ లైట్లు గత రెండు 2 సంవత్సరల నుంచి హేమాక్స్ వీధి దీపాలు వెలగడం లేదని గ్రామ ప్రజలు వానదారులు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో బయటికి వెళ్లాలంటే టార్చ్ లైట్ పట్టుకొని వెళ్లవలసిన పరిస్థితి ఎదుర్కొంటున్నామని గ్రామ ప్రజలు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లింబూర్ గ్రామంలో హేమాక్స్ లైట్లులు దీపాలు వెలిగేలాగా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరారు.

# మేడారం భక్తుల పాలిట 'అక్షయపాత్ర'గా మారిన అన్నదానం

- ఆత్మకూరు కేంద్రంగా మూడు రోజుల మహా సేవా యజ్ఞం
- వెనిశెట్టి శశిధర్ ఉదారతకు ప్రశంసలు






మేడారం సమ్మక్క–సారలమ్మల మహాజాతరకు వెళ్లే భక్తుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా ఆత్మకూరు మండల కేంద్రంలో అరుదైన సేవా కార్యక్రమం కొనసాగుతోంది. ప్రముఖ దాత వెనిశెట్టి శశిధర్ ఆధ్వర్యంలో, ఆత్మకూరు సూర్య మెస్ సౌజన్యంతో భక్తుల కోసం ఏర్పాటు చేసిన 'మహా అన్నదాన సత్రం' భక్తుల పాలిట నిజంగా అక్షయపాత్రగా మారింది. ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల పాటు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఆత్మకూరు కెనరా బ్యాంక్ పక్కన నిర్వహిస్తున్న ఈ అన్నదాన కార్యక్రమం మేడారం వెళ్లే, తిరిగి వచ్చే వేలాది భక్తులకు ఉపశమనం కలిగిస్తోంది. రద్దీ, అలసట, ఖర్చుల భారం మధ్య ఈ ఉచిత భోజనం భక్తులకు ఎంతో ఊరటనిస్తోంది. ప్రత్యేకత ఏమిటంటే ఇది ఒక్కసారి చేసిన సేవ కాదు. వరుసగా మూడో ఏడాది కూడా నిరంతరాయంగా ఈ అన్నదానాన్ని నిర్వహిస్తూ వెనిశెట్టి శశిధర్ తన సేవాభావాన్ని చాటుతున్నారు. తన సంపాదనలో భాగాన్ని ప్రజా సేవకు అంకితం చేస్తూ, అమ్మవారి భక్తుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఈ కారణంగానే స్థానికులు ఆయనను అభిమానంగా 'అపర అన్నదాత'గా కొనియాడుతున్నారు. జాతర వేళ హోటళ్లలో ధరలు పెరిగే పరిస్థితుల్లోనూ, సూర్య మెస్ నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనాన్ని ఉచితంగా అందించడం విశేషంగా నిలుస్తోంది. "సేవయే పరమార్థం" అనే నమ్మకంతో, వెనిశెట్టి శశిధర్ స్వయంగా వడ్డనలో పాల్గొంటూ భక్తులను ఆత్మీయంగా ఆహ్వానిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మేడారం వెళ్లే భక్తులకు సేవ చేయడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. అమ్మవారి ఆశీస్సులతో ఈ అన్నదానం ఎప్పటికీ కొనసాగుతుంది" అని పేర్కొన్నారు.

**విజ్ఞప్తి:** ఆత్మకూరు మీదుగా మేడారం వెళ్లే భక్తులందరూ ఆత్మకూరు కెనరా బ్యాంక్ పక్కన ఏర్పాటు చేసిన ఈ మహా అన్నదాన కేంద్రాన్ని సందర్శించి, భోజన ప్రసాదాన్ని స్వీకరించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# బంగారు వ్యాపారిని నమ్మించి మోసం

- రూ.54 లక్షలకు కుచ్చు టోపి పెట్టిన వైనం
- సిపి చొరవ చూపి న్యాయం చేయాలి.



నమ్మకం మీద సాగే బంగారం వ్యాపారన్ని,బంగారు వర్తకుడిని నమ్మించి నట్టేట ముంచిన ఘటన ఆర్మూర్ పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..కోమన్ పల్లి శ్రీనివాస్ బంగారు వర్తక వ్యాపారం పాత బస్టాండ్ లో నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో తండ్రి కొడుకులైన కత్రోజి శ్రీనివాస్,కత్రోజి విష్ణు, కోమన్ పల్లి శ్రీనివాస్ మధ్య నగదు రూపంలో బంగారు వ్యాపారం కొనసాగింది. నాలుగు నెలలుగా ముందుగా డబ్బులు చెల్లించి బంగారాన్ని కొనుగోలు చేస్తూ వ్యాపారం సజావుగా సాగింది. బంగారు వర్తక వ్యాపారస్తులు ఈ విషయమై గత కొంతకాలంగా కొంతమంది సదరు వ్యక్తులకు నగదు రూపంలో బంగారాన్ని కొనుగోలు చేశారు. ఈ క్రమంలో స్థానిక వ్యాపారస్తుడు కోమన్ పల్లి డై శ్రీనివాస్ కి 600 గ్రాముల బంగారం ఇస్తానని దానికి తగ్గట్టుగా రూ.54 లక్షల నగదు కత్రోజి విష్ణు తీసుకొని ఒకరినొకరు ఒప్పందం కుదుర్చుకున్నారు. రెండు రోజుల్లో బంగారం ఇస్తానని చెప్పి బంగారం ఇవ్వకుండా నగదు తీసుకొని మోసగిస్తూ కత్రోజి విష్ణు తప్పించుకొని తిరుగుతున్నాడు. బాధితుడు డబ్బుల విషయంలో పట్టుబడి నిలదీయడంతో బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకు ఖాతా చెక్కుపై ఆ మొత్తాన్ని వ్రాసి డబ్బులు డ్రా చేసుకోవాలని చెప్పాడు. కొన్ని రోజుల తర్వాత బ్యాంకులోకి వెళ్ళగా గతంలోనే ఖాతాను నిలిపివేసినట్లు బ్యాంక్ మేనేజర్ చెప్పాడన్నారు. ఈ విషయంలో విసిగివేజారిన బాధితుడు గత సంవత్సరం 8వ నెలలో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అనంతరం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని చెప్పాడు. బాధితుడుకి సరైన సమాధానం రాకపోవడంతో నిజామాబాద్ జిల్లా సిపి సాయి చైతన్యకు ఫిర్యాదు చేశాడు. జిల్లా సిపి తన ఆస్తులను బాధితుడికి అటాచ్ చేయాలని ఆర్మూర్ సిఐ కి ఫోన్ లో ఆదేశించాడు. నమ్మించి మోసగించిన కత్రోజి విష్ణు, తండ్రి కత్రోజి శ్రీనివాస్ పై చార్జిషీట్ దాఖలు చేయడంలో జాప్యం చేస్తున్నారు. ఈ విషయమై బాధితులు చెప్పులు అరిగేదాకా స్టేషన్ చుట్టూ తిరిగిన న్యాయం జరగడం లేదని బాధితుడు వాపోతున్నాడు. ఈ విషయమై బంగారు నగదు బదిలీ విషయము పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బంగారం నగదు బదిలీ విషయమై సిపి ప్రత్యేక చొరవ చూపి మోసగించిన వ్యక్తులపై చట్టరిత్య చర్యలు తీసుకోవాలని కోరాడు.

# ఉరేసుకొని చనిపోయిన ప్రేమ జంట

- పదర మండలం చిట్లంకుంట చెందిన యువకుడు



నాగర్ కర్నూల్ జిల్లా పదర మండలం గ్రామానికి చెందిన సువర్ణ మరియు బొమ్మనపల్లి గ్రామానికి చెందిన దాసరి ప్రశాంత్ అచ్చంపేట మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనతో బొమ్మనపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే బొమ్మనపల్లి గ్రామానికి చెందిన దాసరి ప్రశాంత్ అనే యువకుడు పదర మండలం చిట్లంకుంట గ్రామానికి చెందిన సువర్ణ వారిరువురూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు ప్రేమలో పడ్డారు. ఇరువురు ఇష్టపడి వివాహం చేసుకుందామని అమ్మాయి అబ్బాయి ఇంటికి రావడంతో అమ్మాయి తల్లిదండ్రులను మందలించారని తెలిపారు ఈ క్రమంలో ఇరువురు మనస్థాపానికి గురైనట్లు తెలుస్తుంది. అయితే మంగళవారం తమ స్వగ్రామమైన చిట్లంకుంట నుండి అబ్బాయి గ్రామానికి చేరుకొని ఒకరిని విడిచి ఒకరు ఉండలేమని క్షనికావేశానికి గురైనట్లు తెలుస్తుంది. వారి ఇద్దరి మధ్య ఎలాంటి సంభాషణ చోటు చేసుకుందో తెలియదు కానీ రాత్రి ఒకే చీరతో ఇద్దరు ఉరివేసుకొని మృతి చెందారని తెలిపారు. ఈ విషయం బుధవారం ఉదయం సోదరుడు అనుమానం వచ్చి ఇంటి తలుపును తట్టగా ఎలాంటి ఉలుకు పలుకు లేకపోవడంతో తలుపులు పగలగొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా వారిద్దరూ వివిధ జీవులుగా కనిపించారు. గ్రామస్తులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా డీఎస్పీ పల్లె శ్రీనివాస్ మరియు సిఐ నాగరాజు ఘటన స్థలానికి చేరుకొని మృతులను అచ్చంపేట ఆసుపత్రికి పోస్టుమార్టంకి తరలించారు బంధువుల నుంచి ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని డిఎస్పి తెలిపారు.

# ఐలమ్మ కుటుంబానికి న్యాయం చేయాలి



తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, తెలంగాణ తల్లి వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీసీ జనాధికార సమితి -- రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే డిమాండ్ చేశారు. ఐలమ్మ జన్మస్థలమైన రాయపర్తి మండలం కిష్టాపురం గ్రామంలో ఆమె పుట్టిన ఇల్లు పూర్తిగా శిథిలావస్థకు చేరినప్పటికీ, ఇప్పటివరకు ఏ ప్రభుత్వం ఆ కుటుంబానికి పూర్తి న్యాయం చేయలేకపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "దున్నేవాడిదే భూమి" నినాదంతో భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన ఐలమ్మ ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా స్ఫూర్తినిచ్చిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు పలుమార్లు ఐలమ్మ పోరాటాన్ని ఆదర్శంగా కొనియాడిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఐలమ్మ జయంతి సభలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. గతంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు డబుల్ బెడ్?రూం ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చినా, అమలు జరగలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐలమ్మ పేరుతో మహిళా కళాశాల నామకరణం చేయడం స్వాగతార్హమని పేర్కొన్న ఆయన, రవీంద్ర భారతి వేదికపై ప్రకటించిన మహిళా కమిషన్ సభ్యత్వ హామీ కూడా రెండేళ్లుగా అమలుకాలేదని తెలిపారు. ఐలమ్మ పుట్టిన ఇంటికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి, ఆమె వారసులకు ఇచ్చిన అన్ని హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐలమ్మ కుటుంబ సభ్యులు ఓరుగంటి మదర్, ఓరుగంటి వెంకటమ్మ, కత్తి యాకాంత, ఓరుగంటి ఉప్పలయ్య, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల చదువుకు అండగా ఉపాధ్యాయురాలు

జెడ్పిహెచ్ఎచ్ఎస్ గంగదేవిపల్లి పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న అరుకాల స్వరూప రాణి (స్కూల్ అసిస్టెంట్ – సోషల్ స్టడీస్) ఆదర్శప్రాయమైన సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో చదువుతున్న ప్రాథమిక, ఉన్నత తరగతుల విద్యార్థులు -విద్యార్థినులకు సుమారు రూ.30,000 విలువైన పుస్తకాల బ్యాగులను ఆమె అందజేశారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన సహకారం అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన ఈ కార్యక్రమం ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఆమె సేవాభావాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తున్న ఉపాధ్యాయురాలిగా స్వరూప రాణి ఆదర్శంగా నిలిచారని వారు పేర్కొన్నారు.




# కలెక్టర్ లక్ష్మి శ మరియు సి .పి. రాజశేఖర్ బాబు చేతులమీదుగా అవార్డు అందుకున్న చందర్లపాడు పోలీస్ స్టేషన్ SI . రాజనాల ధర్మరాజు



77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం లో ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవ వేడుకల లో ఎ న్టీఆర్ జిల్లా నందిగామ సబ్ – డివిజన్ చందర్లపాడు పోలీస్ స్టేషన్. రాజనాల ధర్మరాజు పోలీస్ శాఖ లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన పోలీస్ ఉన్నతాధికారుల మన్నన ల తో పాటు ప్రజల మన్ననలు పొందిన ఎన్టీఆర్. జిల్లా కలెక్టర్ లక్ష్మి శ మరియు విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు చేతుల మీదగా అవార్డు అందుకోవడం జరిగింది

ఈ సందర్భంగా పలువురు పోలీస్ అధికారులు ఎస్సై ధర్మరాజు వారి ని అభినందించారు

# పెనుగంచిప్రోలు గద్దె వద్దకు బయలు దేరిన శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి అమ్మవారు పరివార దేవత మూర్తులు



ఎన్.టి.ఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణం నుండి రంగుల మహోత్సవ కార్యక్రమాని పూర్తి చేసుకుని పెనుగంచిప్రోలు గద్దె వద్దకు బయలు దేరిన శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ తల్లి అమ్మవారు పరివార దేవత మూర్తులు

భక్తులు సారగరంగా మేళ తాళాలతో నృత్య ప్రదర్శనల నడుమ భక్తి పారవంశంతో అమ్మవారుకి పూజా కార్యక్రమాలు ఘనంగా చేపట్టారు ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు శ్రీరాం రాజగోపాల్ యువనాయకులు శ్రీరాం ధనుంజయ ఆలయ కమిటీ సభ్యులు పోలీసు వారు అగ్నిమాపక సిబ్బంది భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ఆంధ్ర తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ప్రతిష్టాత్మకైన 2026 గురు రత్న అవార్డుకు గుంటూరులో హర్ష ఐఐటి మెడికల్ అకాడమీ ప్రిన్సిపల్ కే బాబ్జి ఎంపికయ్యారు



విద్యారంగంలో క్రీడ రంగంలోనూ అదేవిధంగా టీచింగ్ కమ్యూనిటీ ప్రాబ్లమ్స్ లోనూ ముఖ్యంగా ఇంటర్మీడియట్ వ్యవస్థలో గత 24 సంవత్సరాలుగా అంకితభావంతో సేవలందిస్తున్న కే బాబ్జి విద్యా సేవలను గుర్తించి చెన్నైలోని డాక్టర్ రామచంద్రన్ అమిట్ యూనివర్సిటీ వారు గురురత్న అవార్డును ఎంపిక చేసినది ఈనెల 25వ తేదీన చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు గురురత్న అవార్డు మెమొంటో మరియు నగదు బహుమతి అందజేశారు

ఈ సందర్భంగా అప్పుస్మా స్టేట్ ప్రెసిడెంట్ కొలసాని తులసి విష్ణు ప్రసాద్ అప్సా డెమొక్రటిక్ స్టేట్ ప్రెసిడెంట్ జి మోహన్ రావు హర్ష ఐఐటి మెడికల్ అకాడమీ గుంటూరు మేనేజింగ్ డైరెక్టర్ అయిన ఎస్ శ్రీనివాస్ రెడ్డి లెక్చరర్స్ మరియు స్టూడెంట్స్ ఘనంగా అభినందించారు

# తొలి రోజు నామినేషన్లు మూడు

- కొత్తగూడెం కార్పొరేషన్ హోరా హోరి
- మేయర్ పదవి పై పలు పార్టీల కన్ను



కొత్తగూడెం: మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కార్పొరేషన్ కి సంబంధించి మొదటి రోజు నామినేషన్లు 3 దాఖలు అయ్యాయి కొత్తగూడెం 2 పాల్వంచ1 దాఖలు కాగా బి ఆర్ ఎస్ 2 స్వాతంత్ర అభ్యర్థిగా ఒకటి నామినేషన్లు దాఖలు అయ్యాయని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత తెలిపారు. ఇంకా రెండు రోజులపాటు నామినేషన్లు దాఖలు చేస్తారు. సి పి ఐ బిజెపి కాంగ్రెస్ బిఆర్ఎస్ బిఎస్ పి ఇండిపెండెంట్ లు సిద్ధంగా ఉన్నారు. 60 వార్డులు కలిగిన కలిగిన మున్సిపల్ కార్పొరేషన్ లో పాల్వంచ కొత్తగూడెం సుజాతనగర్ కలిసి అతిపెద్ద కార్పొరేషన్ గా మొట్టమొదటిసారిగా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దీనితో హోరాహోరీగా ఎన్నికలు జరగబోతున్నాయి. మేయర్ స్థానానికి పలువురు పోటీ పడుతున్నారు. మొట్టమొదటిసారిగా కార్పొరేషన్ ఎన్నికల్లో సత్తా చాటుకునేందుకు అభ్యర్థులు వ్యూహాలు పన్నుతున్నారు. దీనితో ఎన్నికలు రసవత్తంగా కొనసాగే అవకాశాలున్నాయి. మొట్టమొదటి మేయర్ స్థానానికై పలు పార్టీలు గురిపెట్టినాయి.




ఈకాలం
THE HONEST TELUGU DAILY




Editor : Devender Nukala. eekalamnews@gmail.com, RNI(PRGI) No.TGTEL/25/A3149

## "జాగృతి"తో ప్రమోద్ నాయకత్వ ఆరంగేట్రం..

# అంచలంచెల పయనం!

## 11వ వార్డుపై దృష్టి..

## AIFB పార్టీ తరఫున కౌన్సిలర్ గా ఆయన సతీమణి పోటీ..



తెలంగాణ జాగృతి కార్యకలాపాలతో నాయకత్వ ఆరంగేట్రం చేసిన అసపు ప్రమోద్ అంచలంచెల పయనం సాగిస్తున్నాడు. అనతి కాలంలోనే జిల్లా గాండ్ల సంఘం అధ్యక్షులుగా నియామకమై అటు కుల సంఘంతో పాటు, తను నివాసం ఉంటున్న 11వ వార్డుపై దృష్టి కేంద్రీకరించాడు. తాజా మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆదిలాబాద్ లో రంగినేని మనీషా పవన్ రావు నేతృత్వం వహిస్తున్న ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున 11వ వార్డు నుంచి తన సతీమణి అసపు నిరోష ప్రమోద్ ను పోటీ చేయించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.





### "ఎలిటిల్ హెల్ప్" ద్వారా సేవలు..

జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సూచనల మేరకు కార్యక్రమాలు చేస్తూ అక్కడ కీలక మవడమే కాకుండా, ఏ లిటిల్ హెల్ప్ ఫౌండేషన్ పేరిట సేవా కార్యక్రమాలు మొదలుపెట్టాడు. పేదలకు అనాథలకు ఆహార పంపిణీ తో పాటు గిరిజన గ్రామాల్లో ఉండే పాఠశాలల్లో స్కూల్ బ్యాగ్స్ బాటిల్స్ తదితర వస్తువుల పంపిణీ చేస్తున్నాడు. తాజా మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో తన భార్యను బరిలోకి దించి కాలనీవాసుల మన్ననలు పొందే ప్రయత్నం చేస్తున్నాడు.



